క్లుప్తంగా...

కార్యాలయం ప్రారంభం వాయిదా

శంషాబాద్: రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం మరోసారి వాయిదా పడింది. గురువారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేత ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ భారీ వర్షాల కారణంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. గతంలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ చేత కార్యాలయం ప్రారంభానికి ఏర్పాట్లు చేసినా వాయిదా పడింది.

రుద్రాభిషేకాలు ప్రారంభం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీలోని శ్రీకాశీ విశ్వనాథ సమేత నల్లపోచమ్మ దేవాలయంలో అధిక నిజ శ్రావణమాసాన్ని పురస్కరించుకుని చేపట్టిన రుద్రాభిషేకాలు గురువారం నుంచి ప్రారంభించారు. రుద్రాభిషేకాలు 63 రోజుల పాటు వినాయక చవితి వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని అర్చకులు శాంత కుమార్ శర్మ తెలిపారు.

ఎంజీఐటీలో 22న అలుమ్నీ

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో ఈనెల 22 తేదీ సాయంత్రం 5గంటలకు పూర్వవిద్యార్థుల సమ్మేళనం(అలుమ్నీ) నిర్వహిస్తున్నామని కళాశాల చైర్మన్ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్నత ఉద్యోగాలలో రాణిస్తున్న వారు హాజరవుతారన్నారు.

కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడం తగదు

అత్తాపూర్: 'డబుల్' ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం తగదని బీజేపీ సీనియర్ నాయకులు ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డబుల్ ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో దౌర్జన్యంగా అరెస్టు చేయడం సరికాదన్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగమంటూ రూ. 1.25 లక్షలు స్వాహా

శంషాబాద్ రూరల్: ఇంటి వద్దనే ఉంటూ ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తామని ఓ మహిళ నుంచి రూ. 1.25 లక్షలు కాజేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఊట్‌పల్లిలో ఉండే మౌనికకు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగం కల్పిస్తామంటూ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. సదరు మహిళ ఆ ఉద్యోగానికి అంగీకరించడంతో అందుకు రూ. 2 వేలు చెల్లించాలని, మరో మెసేజ్ రావడంతో పాటు కంపెనీ రివ్యూని రాసి పంపాలన్నారు. రివ్యూ రాసి పంపిన తర్వాత ఆమెకు రూ. 2800 పంపారు. ఆమెకు నమ్మకం రావడంతో పలు దఫాలుగా రూ. 1.25 లక్షలు పంపింది. ఉద్యోగం కోసం సంప్రదించగా మరో రూ.1.50 లక్షలు పంపాలని మెసేజ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఆశ్రయించింది.

'యూఎల్‌సీ అనుమతులు ఉన్నాయి'

మణికొండ: తమ భూమికి ప్రభుత్వం నుంచి యూఎల్‌సీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భవనం నిర్మించుకుంటున్నామని కె.సీతారామరావు తెలిపారు. గురువారం ఆయన మణికొండలో విలేకరులతో మాట్లాడారు. తమకు అన్ని అనుమతులు ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధి ఓ విలేకరిని తప్పుదోవ పట్టించి తప్పుడు వార్తలు రాయించాడని పేర్కొన్నారు. తప్పుగా వచ్చిన వార్తను పట్టుకుని తమను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంజాయిషీలు అడుగుతున్నారన్నారు. నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని 141/పి, 143/పి, 144/పి లలో 1719.85 చదరపు మీటర్లకు 2018 సంవత్సరం ప్రొసిడింగ్ నెంబరు హెచ్/747/21630/08 ప్రకారం యూఎల్‌సీ ఉందని తమ భవనంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు ధర్నాకు వెళ్లనివ్వకుండా బీజేపీ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గృహ నిర్బంధంతో బీజేపీని అడ్డుకోలేరని ప్రజల పక్షాన నిలుస్తూ ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుందన్నారు.

రోజంతా వర్షం.. రోడ్లన్నీ జలమయం



● ఏరులై పారిన వరద ● రాకపోకలకు ఇబ్బందులు ● చర్యలు చేపట్టిన అధికారులు

మణికొండ: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని రోడ్లన్నీ గురువారం జలమయమయ్యాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ఏరులై పారింది. మున్సిపాలిటీ సిబ్బంది అక్కడక్కడా జాగ్రత్తలు తీసుకుని మ్యాన్ హోళ్లను తెరచి రోడ్లపై నిలిచిన నీరు వెళ్లిపోయేలా చర్యలు చేపట్టారు. వాతావరణ శాఖ సూచనల మేరకు విద్యాశాఖ గురు, శుక్రవారాలు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. గురువారం అప్పటికే పాఠశాలలకు చేరుకున్న విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. కొన్ని ప్రైవేటు పాఠశాల వారు మధ్యాహ్నం వరకు తరగతులను నిర్వహించి విద్యార్థులను ఇంటికి పంపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఓ పాత ఇల్లు కూలిపోయింది.



నార్సింగిలో వర్షానికి కూలిన గదిని కూల్చుతున్న మున్సిపల్ సిబ్బంది

పొంగిన పందెన్‌వాగు

భారీగా కురిసిన వర్షానికి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పందెన్‌వాగు పొంగి ప్రవహిస్తుంది. గురువారం సాయంత్రం నుంచి వాగులో నీరు ఒక్కసారిగా పెరగడంతో వాగు నిండి పక్కనుంచి ప్రవహిస్తుంది. మరింత నీటి మట్టం పెరిగితే పక్కనే ఉన్న పంచవటి కాలనీ రోడ్లు, అపార్ట్‌మెంట్‌లలోకి నీరు వచ్చే అవకాశం ఉంటుందని కాలనీ వాసులు తెలిపారు. పంచవటి కాలనీ ప్రవేశం వద్ద వంతెన వద్ద వరద రోడ్డుపై పారుతుండటంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. వర్షం కారణంగా ఇబ్బందులు తలెత్తితే 18005997575 నంబర్‌కు ఫోన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ తెలిపారు.

జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో..

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. వరద నీటితో రహదారులన్నీ నిండిపోయాయి. కురుస్తున్న వర్షాలకు వాహనదారులు రోడ్లపై ప్రయాణించేందుకు సైతం వీలు లేకుండా పోయింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఆరాంఘర్– జూపార్క్ రహదారి మూసివేత

రాజేంద్రనగర్: ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్‌కు వెళ్లే ప్రధాన రహదారిని గురువారం మధ్యాహ్నం నుంచి తాత్కాలికంగా మూసి వేశారు. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ పనులు జరుగుతుండడం, వర్షం నీరంతా నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌ను మళ్లించి రహదారిని మూసి వేశారు. ఆరాంఘర్ చౌరస్తా, దుర్గానగర్, కాటేదాన్, గగన్‌పహాడ్, బుద్వేల్ రైల్వే బ్రిడ్జీ, రాజేంద్రనగర్, శివరాంపల్లి, బుద్వేల్, పీడీపీ చౌరస్తా, ఉప్పర్‌పల్లి డీమార్ట్, బెస్ట్ ప్రైజ్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



మణికొండలో లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉన్న డిజాస్టర్ టీం



పందెన్‌వాగు నిండి పక్కనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



కోహినూర్ కాలనీ మార్గంలో రోడ్డుపై కూలిన చెట్టు



కె.కె.నగర్ కన్వెన్షన్ వద్ద రోడ్డుపై పారుతున్న వరద

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: ప్రజలు తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 18, 19, 20వ డివిజన్‌లలో శానిటేషన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి వద్దనే తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి కంపోస్టు తయారు చేసి ప్రజలు అందించాలని సూచించారు. కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజలంతా పూర్తి సహయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు సురేష్‌గౌడ్, నరేందర్ డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ రవి, హెల్త్ అసిస్టెంట్ నరేష్, శానిటరీ జవాన్లు యాదగిరి, నరేందర్, గిరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

అన్నదానం

రాజేంద్రనగర్: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎడిఫై వరల్డ్ స్కూల్ డైరెక్టర్లు రాజేశ్వర్‌రెడ్డి, హరితరెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరు పేదల ఆకలి తీర్చేందుకు గురువారం ఉప్పర్‌పల్లిలోని ఎడిఫై వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో నీలోఫర్ ఆసుపత్రి వద్ద భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరు జాగ్రత్తలు పాటించాలని అత్యవసరం ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దన్నారు.



భోజనాన్ని అందజేస్తున్న హరితరెడ్డి

భాషను కాపాడుకోవాలి

● మనూ వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: భాషా వారసత్వాన్ని రక్షించడంతో బాటు పెంపొందించుకోవాలని మనూ వీసీ ఐనుల్ హసన్ కోరారు.గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మేధావులతో ఆయన సమావేశమయ్యారు. విద్య, భాషా పరిరక్షణ, సామాజిక, విద్య, సమాజాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఆయన వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాంతం, దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించడానికి మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం వివిధ రంగాలకు చెందిన పండితులు, రచయితలు, ప్రతినిధులు, నిపుణులతో చర్చించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ చైర్మన్ డాక్టర్ యాసుఫ్ ముల్లా, విద్యావేత్త డాక్టర్ కెహెచ్ శల్మణి, ఎడ్యుకేషన్ టుడే ఎడిటర్ డాక్టర్ జీషాన్‌అబ్బాస్ రజ్వీ తదితరులు పాల్గొన్నారు.



'నెమలి కన్నులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య గోనానాయక్, ఆచార్యులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్లవెంకటేశ్వరరావు రచించిన నెమలి కన్నులు (ఆత్మకథ మొదటిభాగం) పుస్తకాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయ ట్రైబల్ అధ్యాపక సంఘం కార్యదర్శి ఆచార్య ఎం గోనానాయక్ ఆవిష్కరించారు.ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే ఆచార్య దార్ల ఆత్మకథ అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ కనిపించే కొన్ని బహిర్గతం కాని జీవన సంఘర్షణలు, సంవేదనలను ఆత్మకథల్లో ప్రతిఫలింపచేస్తారని, అటువంటివెన్నో ఆచార్య దార్ల ఆత్మకథలో ప్రతిఫలించాయన్నారు. ఆత్మకథ రాయడమనేది ఒక సాహసంతో కూడిన పని అనీ అటువంటిది దళిత ఆత్మకథ రాయడం మరింత కష్టమైందన్నారు. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం పూర్వ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ కవిగా, విమర్శకుడుగా సహ అధ్యాపకులుగా ఉన్న ఆచార్య దార్ల తన ఆత్మకథలో ఒక దళితుడు విశ్వవిద్యాలయ స్థాయిలో ఉన్నతస్థితిలోకి రావడానికి గల నేపథ్యం ఈ ఆత్మకథలో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆచార్యులు పమ్మి పవన్‌కుమార్, డి విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి విజయకుమారి మధుసూదన్, తిరుమల సింగ్ పాల్గొన్నారు.

సృజనోత్సవ్-2023 లోగో ఆవిష్కరణ

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ స్వర మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లలిత కళల పోటీల సమాహారం సృజనోత్సవ్-2023 లోగోను గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇది చక్కటి వేదిక అన్నారు. సంస్థ అధ్యక్షుడు ఆదిత్య కిరణ్ మాట్లాడుతూ.. ఈ పోటీ ల్లో పాల్గొనదలిచిన వారు 94404 67585, 95051 23489 లలో సంప్రదించాలని సూచించారు.

గొర్రెల పంపిణీ

శంషాబాద్ రూరల్: పిల్లోనిగూడ గ్రామంలో గురువారం సర్పంచ్ కర్రె బుచ్చమ్మ చేతుల మీదుగా పలువురికి గొర్రెలను పంపిణీ చేశారు. పశువైద్యులు నరోత్తమ్‌రెడ్డి, జ్యోతి, అంజనేయులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె నర్సింహా ముదిరాజ్, జుర్కి రమేష్, యాదయ్య పాల్గొన్నారు.

ఎంఎస్ థీసిస్ అవార్డు గ్రహీతలు వీరే..

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో విజయ్ కుమారిశర్మ, రితేష్‌కుమార్ తివారీ ఎంఎస్ థీసిస్ అవార్డు గ్రహీతలను గురువారం ప్రకటించారు. 2021, 2022 సంవత్సరాలకుగానూ ట్రిపుల్‌ఐటీలోని రోబోటిక్స్ రీసెర్చ్ సెంటర్(ఆర్ఆర్‌సి), సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్(సీసీఎన్ఎస్‌బీ) వారు అవార్డులను గెలుచుకోవడం విశేషం. ఇనిస్టిట్యూట్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సహాయం అందించేందుకు ఈ అవార్డును అందించడం జరుగుతోంది. 2021 సంవత్సరానికి కర్ణిక్‌రామ్, 2022కు ఉత్కర్ష్ ఆజాద్‌లను అవార్డులకు ఎంపిక చేశారు. వారిని పలువురు అభినందించారు.

గురుకుల పీఈటీలను తక్షణమే భర్తీ చేయాలి

గన్‌ఫౌండ్రీ: గురుకుల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ నిరుద్యోగ పీఈటీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. 2017 టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ గురువారం నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో 616 పీఈటీ పోస్టుల భర్తీ కోసం 2017లో నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించారని గుర్తుచేశారు. కాగా అందులో 1200 మంది అభ్యర్థులు ఎంపిక చేసి సర్టిఫికెట్ పరిశీలన కోసం పిలిచారని, వివిధ కారణాలతో ఎంపిక నిలిచిపోయిందన్నారు. గురుకుల పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 6 సంవత్సరాలుగా తాము ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నామని తమకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు గాంధీభవన్ నుంచి ఒక్కసారిగా ముట్టడికి రావడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులకు, అభ్యర్థులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగి పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

సమావేశం వాయిదా

రాయదుర్గం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శాంతిసరోవర్‌లో నిర్వహించతలపెట్టిన సమావేశం వాయిదా వేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ నెల శుక్రవారం 'సక్సెస్ మంత్రా' పేరిట యూత్ మోటివేషన్ కార్యక్రమాన్ని వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు వారు పేర్కొన్నారు.

నాలా పరీవాహక ప్రాంతాల పరిశీలన

మియాపూర్: లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ వద్ద నాలాలు, నాలా పరీవాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. శ్రీనివాస్‌యాదవ్, గౌతమ్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూత

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.మధు పేర్కొన్నారు. గురువారం మధుబన్ కాలనీకి చెందిన సీఎం బిల్డింగ్ సిస్టమ్ యజమాని చెందన్‌కేరి వినోద్‌కుమార్ రూ. 40 వేలు, ప్లాస్టిక్ కంపెనీ యజమాని ఎస్.ఎం.రెడ్డి రూ.20 వేల చెక్కును సీసీ కెమెరాల ఏర్పాటు నిమిత్తం సీఐ మధుకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు అన్ని కాలనీలలో ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. పోలీస్ శాఖ తరఫున ప్రధాన రహదారులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని అన్నారు. కాలనీ వెల్ఫేర్, పొదుపు సంఘాలు, యూత్ అసోసియేషన్, కాటేదాన్ ఇండస్ట్రీయల్‌లోని కంపెనీ యజమాన్యం సహకారాలు ఉంటే అన్ని కాలనీలలో కెమెరాలను అమర్చడానికి సాధ్యం అవుతుందన్నారు.



సీఐకు చెక్కును అందజేస్తున్న కంపెనీ యజమానులు

తైక్వాండోలో సత్తా

మణికొండ: అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్-2023లో క్రీడాకారులు సత్తా చాటి 36 పతకాలను సాధించారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి 20 వరకు జరిగిన పోటీలలో దేశం తరఫున 21 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో ఎక్కువగా హైదరాబాద్, మణికొండకు చెందిన వారే ఉన్నారని గ్రాండ్ మాస్టర్ సోమ విజయ్‌కుమార్ తెలిపారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు మొత్తం 7 బంగారు, 10 వెండి, 19 రజిత పతకాలను సాధించారని పేర్కొన్నారు.



సత్తాచాటిన క్రీడాకారులతో గ్రాండ్‌మాస్టర్

గంజాయిని తరలిస్తున్న ముఠా అరెస్టు

అత్తాపూర్: గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను రాజేంద్రనగర్ ఎస్ఓటీ, అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కునాల్ దోర, మహారాష్ట్రకు చెందిన విజయ్ (36), ప్రదీప26), సత్యనారాయణ(47), సావిత్ర(36), జయా సోలంకి(22), కునాల్ దాదారావు(19), ప్రదీప్ సాల్వే, బాబా అవస్కర్ ముఠాగా ఏర్పడి కునాల్ డోరా ఒడిస్సా రాష్ట్రంలోని బీరంపూర్‌లోని ఏజెన్సీ ఏరియాలో గంజాయిని పండించి మహారాష్ట్రకు తరలిస్తుంటాడు. ఒడిస్సా నుంచి ట్రైన్‌లో సరఫరా చేసి అనంతరం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగిస్తుంటారు. గురువారం అక్రమంగా గంజాయిని తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ, అత్తాపూర్ పోలీసులు చింతల్‌మెట్ వద్ద నిందితులను తనిఖీ చేయగా 110 కేజీ గంజాయి లభ్యమైంది. విజయ్, ప్రదీప, సత్యనారాయణ, సావిత్ర, జయా సోలంకి, కునాల్ దాదారావును అదుపులోకి తీసుకున్నారు. కునాల్ దోర ప్రదీప్ సాల్వే, బాబా అవస్కర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

గచ్చిబౌలి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తుందని ఆ శాఖ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పీఆర్‌టీయుటీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొండాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టే విధంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ శేరిలింగంపల్లి శాఖ హనుమంతు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, శంకర్, పీవీ రావు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న సామల మహేందర్ రెడ్డి తదితరులు

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



గచ్చిబౌలి: చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖారవాని,ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన శివకుమార్ కుంటి(21) గౌలిదొడ్డి , కేశవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మంత్రి అపార్ట్‌మెంట్స్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడటం, వ్యక్తి గత సమస్యలు ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురై మైహోం క్రిష్ అపార్ట్‌మెంట్ వెనక భాగంలోని నిర్మానుష్య ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు స్థానికులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.